# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-08-2024　　　　సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.
- ❖ నూతన సంస్కరణలతో రైతుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెనాయుడు పేర్కొన్నారు.
- ❖ దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం అనుమతిచ్చిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ❖ నూతన విద్యా విధానం యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

=========================

రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయని, ఈ సమస్యలకు కారణమైన అధికారులపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో "రీసర్వే అస్తవ్యస్తంగా జరగడం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గాలు, జిల్లాల్లో ఫిర్యాదులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. శాఖల వారీగా చేపడుతున్న సమీక్షలు సత్ఫలితాలు ఇస్తున్నాయి" అని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

=========================

దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి కేంద్రం అనుమతిచ్చిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరు వల్లే ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రం వెనకబడిందని, కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించుకుంటే ఇప్పటికే 5, 6 లక్షల ఇళ్లు కట్టించి

ఉండొచ్చన్నారు. ఉపాధి హామీకి సంబంధించి కేంద్రం పరిమితి లేకుండా నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. పూర్తి స్థాయిలో నిధులు వినియోగించుకొని జల్‌జీవన్ మిషన్ పూర్తి చేసుకోవాల్సిన అవసరముందని పెమ్మసాని తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=========================

నూతన సంస్కరణలతో రైతుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు అన్నారు. ఈరోజు విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల బ్యాంకుల (ఆప్కాబ్) రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్నా మంత్రి మాట్లాడతూ, బ్యాంకులకు ధీటుగా సహకార సంఘాలు రూపుదిద్దుకోవాలని అన్నారు. సాగు చేసే రైతుకు ప్రాధాన్యత ఇస్తూ... కౌలు రైతులను సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చి రుణాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభించిన మంత్రి ఈ సేవలు విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

=========================

వృక్షో రక్షతి రక్షితః అనే నినాదంతో విశాఖలోని గ్రీన్ క్లైమేట్ పర్యావరణ స్వచ్ఛంద సంస్థ వృక్షాబంధనం కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్ రోడ్ లోని 140 ఏళ్ల చరిత్ర గలిగిన భారీ మర్రి వృక్షానికి విద్యార్థులు రాఖీ కట్టి వృక్ష సంపద ఆవశ్యకతను చాటిచెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన "ఏక్ పేడ్ మాకే నామ్" స్ఫూర్తితో మొక్కలు నాటడాన్ని ఒక ఉద్యమంగా చేట్టామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఓ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం అన్నారు. చిప్కో ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని మొక్కలను పెంచాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలలకి చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకులు పిలుపునిచ్చారు.

=========================

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ విద్యా సంస్థలను ఆదేశించారు. ఈరోజు పాడేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 15వ తేదీలోగా మూడు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ, ఐటిడిఏ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాల్లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. అదే విధంగా లీగల్ సెల్ ఆధారిటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహాలు సూచనలు అందిస్తారని, దీనిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విరామం

=========================

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో కేదార్ నాధ్ యాత్రకు వెళ్ళిన తెలుగు యాత్రికులు సహాయం కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సమాచారం అందించారు. కేదార్‌నాథ్ స్వర్గ రోహిణి కాటేజిలో ఆహారం, నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని తమకు సహాయం అందించాల్సిందిగా యాత్రికులు కేంద్ర మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి ఉత్తరాఖండ్ అధికార యంత్రాంగంతో మాట్లాడడంతో, వారిని సురక్షితంగా బయటకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

=========================

నూతన విద్యా విధానం యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఉన్నత విద్యలో జాతీయ విద్యా విధానం అమలు, సవాళ్లు అనే అంశంపై విజయవాడలో

రెండు రోజుల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. భారతీయ విలువను జోడించిన ఈ కొత్త విద్యా విధానం యువతలో సృజనాత్మకతను వెలికి తీస్తుందని అన్నారు. ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులు ఉన్నవారికి కూడా ఈ నూతన విద్యా విధానం ద్వారా ఎక్కడైనా చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. నూతన విద్యా విధానం ద్వారా జరిగే మంచిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ.....

(వాయిస్ 23 సెకన్లు)

==========================

గోదావరి నదికి వరద కొనసాగుతుంది. అయితే వరద ఉధృతి కాస్త తగ్గడంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి స్థిరంగా కొనసాగుతునప్పటికీ, ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉధృతి మళ్ళీ పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

==========================

తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం 10 గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా 4.64 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.8 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 215.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 204.7 టీఎంసీల వరకు నీరు నిలువు ఉందని అధికారులు వివరించారు.

==========================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే 3, 4 రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా పయనించి వాయుగుండంగా మారనుందని ఐఎండి పేర్కొంది. దీంతో ఈరోజు నుంచి ఈనెల 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పలు జిల్లాలలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

==========================

శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ రోజు ఎచ్చెర్ల మండలంలో పర్యటించిన కలెక్టర్ బుడగట్లపాలెంలో రెవిన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి హార్బర్ పనులకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగిపోయిన హార్బర్ పనులను ప్రారంభించి, ప్రతి 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

==========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు వారి టోకెన్లపై నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూ లైన్ లోనికి ప్రవేశించాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందుగా వెళ్లిన భక్తులను క్యూలైన్ లోకి అనుమతించరని టిటిడి తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరింది.

==========================

రాష్ట్ర అభివృద్ధికి అందరూ సమష్టిగా కలిసి పని చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఈరోజు గుంటూరు జిల్లా పరిషత్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పేదలకు అందించాల్సిన రేషన్‌లో చాలా అక్రమాలు జరిగాయని, అవినీతి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ వ్యవస్థ ద్వారా వచ్చే నెల నుంచి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =